క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ స్వప్న

హయత్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు వేస్తామని పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్న అన్నారు. మున్సిపాలిటీలోని 2వ వార్డు శ్రీరామ్‌నగర్‌నగర్ కాలనీలో రూ.8 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. కాలనీలో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణరెడ్డి, డీఈఈ అశోక్‌కుమార్, కోఆప్షన్ సభ్యులు శంకరయ్యగౌడ్, అజ్మీరా బేగం, నాయకులు విజయశేఖర్‌రెడ్డి, బొర్ర సురేష్, జోర్కు శ్రీరాములు, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ఆర్థికసాయం



కళాకారులకు నగదు అందజేస్తున్న సభ్యులు

కడ్తాల్: ప్రాచీన కళలు, వీధి నాటకాలను కాపాడుకుందామని ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు అన్నారు. ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామంలో శుక్రవారం సీతారాముల కల్యాణం వీధినాటక ప్రదర్శించారు. ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి అందజేసిన రూ.10 వేలను ఫౌండేషన్ సభ్యులు కళకారులకు అందజేశారు. కళాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. అశోక్, వెంకటయ్య, సాయిలు, జంగయ్య, బాలయ్య, ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి



పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌యాదవ్

తలకొండపల్లి: మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెల్జాల్‌లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి రామసిపల్లి మైసమ్మ గుడి వరకు మట్టి రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతిబీమా, అటల్ పెన్షన్ యోజనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వెల్జాల్ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో కలిసిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ నర్సింగ్‌నాయక్, హరీష్‌రెడ్డి, కార్యదర్శి శరత్ కుమార్, సిసి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈద్ ఉల్ ఫితర్



ఇబ్రహీంపట్నం ఈద్గా

ఇబ్రహీంపట్నం: నెలవంక దర్శనంతో ఈద్ ఉల్ ఫితర్(రంజాన్) పర్వదినాన్ని శనివారం ముస్లింలు జరుపుకోనున్నారు. 30 రోజుల పాటు కఠిన ఉపవాసదీక్షలు శుక్రవారంతో ముగిశాయి. పండుగ నమాజ్‌కు సంబంధించి ఇబ్రహీంపట్నం చిన్నచెరువు కట్ట కింద ఉన్నర ఈద్గాను మున్సిపల్ అధికారులు సిద్ధం చేశారు. ప్రార్థన వేదికకు రంగులు వేసి తీర్చిదిద్దారు. పిచ్చిమొక్కలు, చెత్తచెదారం లేకుండా శుభ్రం చేశారు. వేలాది మంది ముస్లింలు ప్రతి యేడు ఈ ఈద్గా వద్ద రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రత్యేక నమాజ్ చేస్తారు. మంచినీటి సదుపాయం తదితర సౌకర్యాలను మున్సిపాలిటీ కల్పించనుంది.

24 నుంచి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధనలో శ్రీ మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 24న ప్రారంభమై 27 వరకు కొనసాగుతాయని సర్పంచ్ బక్కి కుమార్, ఆలయ నిర్వాహకులు విఠల్‌జీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న ఉదయం 8గంటలకు కలశ స్థాపన, రాత్రి భజన కార్యక్రమమం, 25న ఎల్లమ్మ బోనాలు, 26న స్వామికి గంగా స్నానము, బండ్లు తిప్పుట, సాయంత్రం బోనాలు, రాత్రి కథా కాలక్షపం, 27న తెల్లవారు జామున 4 గంటలకు మల్లికార్జునస్వామి కళ్యాణమహోత్సవం.. ఉదయం 8 గంటలకు పాటేళ్ల బండిపై ఊరేగింపు, 11 గంటలకు గురుపూజ, సాయంత్రం 3 గంటలకు ట్రాక్టర్ల పోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతు అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే జైపాల్ యాదవ్
- పడకల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- తలకొండపల్లిలో గోదాం నిర్మాణ పనులకు భూమిపూజ



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

తలకొండపల్లి: చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. దళారులను ఆశ్రయించి రైతులు మోసపోకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పడకల్‌లో పొద్దుతిరుగుడు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, తలకొండపల్లిలో సింగిల్‌విండో గోదాం నిర్మాణ పనులు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, సీసీరోడ్డు నిర్మాణ పనుల ప్రారంభోత్సవం కార్యక్రమాలను పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యేతో పాటు, జెడ్పీటీసీ వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ నిర్మల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.75 లక్షల నాబార్డు నిధులచే గోదాం నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి బ్యాంక్‌ల ద్వారా రూ.35వేల కోట్ల రుణం తీసుకొని ధాన్యం కొనుగోలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సర్పంచ్‌లు లలిత, జ్యోతయ్య, రమేష్, కుమార్, ఉప సర్పంచ్ అనిల్, ఎంపీటీసీలు రమేష్, హేమరాజు, రఘునాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్, సింగిల్‌విండో డైరెక్టర్లు యాదయ్య, శ్రీను, శేఖర్, యాదయ్య, దేవులా, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ..

తలకొండపల్లి: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జామా మసీద్‌లో ముస్లిం సోదరులకు ప్రభుత్వ పరంగా మంజూరైన రంజాన్ కానుకలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ శ్రీకాంత్, ఆర్ఐ మంజుల, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్‌నాయక్, విజయ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమేష్, అజీం, సజ్జుపాషా, ఖాజాపాషా, శ్రీశైలం, కుమార్, సర్పంచ్ రమేష్, కృష్ణయ్య, స్వామి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులివ్వండి

చిత్తాపూర్ సర్పంచ్ నాగరాజుగౌడ్



ఎమ్మెల్యే మంచిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాగరాజ్‌గౌడ్

మంచాల: గ్రామ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని చిత్తాపూర్ గ్రామ సర్పంచ్ బొడ్డు నాగరాజ్‌గౌడ్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కోరారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు, మంచాల నుంచి చిత్తాపూర్ బీటీ రోడ్డు మరమ్మతు, గ్రామంలో 109 సర్వే నంబర్ భూమిలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించే పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వలస కూలీలకు పౌష్టికాహారం

ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ



వలస కూలీలకు సరుకులు అందజేస్తున్న సీడీపీఓ శాంతిశ్రీ

ఇబ్రహీంపట్నం రూరల్: వలస కూలీలకు ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న గర్భిణులు, బాలింతలు, 7 నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు పిల్లలకు రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశానుసారం శుక్రవారం టేక్‌హోం రేషన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం సీడీపీఓ శాంతి శ్రీ మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల్లో ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న వలస కార్మికులకు ప్రతినెల బియ్యం, పప్పు, నూనెలు, బాలామృతం, పాలు సరఫరా చేస్తామన్నారు. అలాగే వారి పిల్లలకు బాలమృతం అందజేస్తున్నామన్నారు. క్రమం తప్పకుండా సరుకులు తీసుకోవాలని తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ సరళ, అంగన్‌వాడీ టీచర్ బేబీ, ఆశ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రోత్సాహం అందించాలి



క్రికెట్ కిట్ అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: గ్రామీణ క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందించాలని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో శుక్రవారం ఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను సర్పంచ్ తులసీరాంనాయక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. క్రీడాకారులకు స్వచ్ఛంద సంస్థలు, నాయకులు ప్రోత్సాహం అందించాలన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దుద్యానాయక్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, నాయకులు రాందాస్‌నాయక్, హీరాసింగ్, రెడ్యానాయక్, జవహర్‌లాల్, కిషన్, తులసీరాం, వినోద్, మల్లేశ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఈద్గా నిర్మాణానికి దివంగత గూడూరు మనోహర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు (కడ్తాల్ గ్రామ సర్పంచ్) గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి రూ.లక్ష వ్యక్తిగతంగా విరాళం అందజేశారు. శుక్రవారం మజీద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మజీద్ నిర్వాహకులకు రూ.లక్ష నగదును సర్పంచ్ అందజేశారు. ఈ మేరకు మజీద్ కమిటీ సభ్యులు సర్పంచ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షుడు జావీద్, మౌలానా జహీరుద్దీన్, వార్డుసభ్యులు నరేందర్‌రెడ్డి, మల్లయ్య, భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, మహేశ్, నర్సింహ, వెంకటేశ్, అశోక్, నాగార్జున, ముస్లిం సోదరులు ఉన్నారు.

రూ.26వేల కనీస వేతనం చెల్లించాలి

వీఓఏల సమ్మెకు పలు పార్టీల మద్దతు

కడ్తాల్: వీఓఏలకు కనీస వేతనం రూ.26వేలు ప్రకటించాలని మాడ్గుల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు చేపట్టిన సమ్మె, శుక్రవారానికి 5వ రోజుకు చేరుకుంది. సమ్మెకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సభ్యుడు కురుమయ్య, వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు ఈశ్వర్, వెంకటమ్మ, నరేందర్, శ్రీను, రాజు, లక్ష్మయ్య, పుష్ప, యాదగిరి, నర్మద, మంగ, శశికళ, పాపయ్య ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి..

కడ్తాల్: వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన సమ్మెకు శుక్రవారం పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు, కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. వీఓఏలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పట్టణ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, వీఓఏలు ఉన్నారు.

మద్దతు తెలిపిన జెడ్పీటీసీ..

తలకొండపల్లి: సమస్యల సాధనకై వీఓఏలు ఎంపీడీఓ కార్యాలయం ఎదు నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారానికి ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భం జెడ్పీటీసీ వెంకటేశ్, ఎంపీపీ నిర్మల సమ్మెకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి శశికళ, ఉపాధ్యక్షుడు అరుణ, నర్సింహ, కోశాధికారి కల్పన, కృష్ణారెడ్డి, రాణి, మానస, యాదమ్మ, స్వప్న, శివలీల, మాధవి, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జుమాతుల్ విదా ప్రత్యేక ప్రార్థనలు



ఆమనగల్లు మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు

కడ్తాల్: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో రంజాన్ మాసం చివరి శుక్రవారం రోజున ముస్లిం సోదరులు జుమాతుల్ విదా ప్రార్థనలను నిర్వహించారు. మండల కేంద్రంలోని కుబా మజీద్, అర్షద్ మజీద్‌లో ఉపవాసదీక్షలు చేపట్టిన ముస్లింలు, మజీద్ ఇమామ్ జహీరుద్దీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ మాసంలో చివరి శుక్రవారం పవిత్రదినం కావడంతో ప్రత్యేక ప్రార్థనలు, నమాజు నిర్వహించినట్లు మౌలనా ఇమామ్ జహీరుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు రవూఫ్, ఉపాధ్యక్షుడు జావీద్, హైమద్ జానీ పాల్గొన్నారు. అలాగే ఆమనగల్లు పట్టణంలోని జామా మజీద్, మొహమ్మదీయ మజీద్, హామాదే హీరాల్ మజీద్‌లో జుమాతుల్ విదా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఆయా మజీద్‌ల అధ్యక్షులు మహ్మద్ మాసుమ్, గౌస్ మైనోద్దీన్, ఖాదర్ ఖాద్రీ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

తలకొండపల్లి: మండల పరిధిలోని లింగరావుపల్లిలో శుక్రవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు, జెడ్పీసీ వెంకటేశ్ హైదరాబాద్ కామినేని ఆస్పత్రివారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో అనేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి అన్నారు. ఈ శిబిరంలో 254 మంది రోగులను పరీక్షించి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, కోఆప్షన్ ఇమ్రాన్, ఎంపీటీసీ రమేష్, ఉప సర్పంచ్ మణికంఠ, శ్యాం సుందర్‌రెడ్డి, సాయులు, అరవింద్, యాదయ్య, సత్యం, బుచ్చిబాబు, వైద్యులు, పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కడ్తాల్: సీఎం రిలీఫ్‌ఫండ్ నిరుపేదలకు వరమని ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ పత్యానాయక్ అన్నారు. ఆమనగల్లు మండలం కొత్తకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని మంగలకుంట తండాకు చెందిన సుమన్‌కు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.9500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఈ మేరకు శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును జెడ్పీటీసీ అందజేశారు. ఎంపీటీసీ కుమార్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, నాయకులు పత్యానాయక్, రాములుయాదవ్, భీమయ్య, వెంకటేశ్, కేశవులు, గణేశ్ ఉన్నారు.

టీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

తలకొండపల్లి: క్రీడలు దేహ దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని స్థానిక నాయకుడు తుమ్మ నరసింహ అన్నారు. మండల కేంద్రంలో జూనియర్ టీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. తగిన ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, జ్యోతయ్య, ఉప సర్పంచ్ అనిల్, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కడ్తాల్: మాడ్గుల మండల పరిధిలోని అవురుపల్లి, నల్లావారిపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ రాఘవులు శుక్రవారం పరిశీలించారు. కూలీల వివరాలను, పనుల సమోదును పరిశీలించారు. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది ఉన్నారు.

మంచాలలో ఇఫ్తార్ విందు

మంచాల: మంచాల మండల కేంద్రంలో వీ ఆర్ వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీ ఆర్‌వన్ ఫౌండేషన్ చైర్మన్ కుకుడాల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అందరం కలిసి ఉండాలన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలతో పాటు మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, ముస్లింపెద్దలు పాల్గొన్నారు.

రంజాన్ వేడుకకు రండి

కడ్తాల్: మండల కేంద్రంలో శనివారం నిర్వహించే ఈదుల్ ఫితర్ వేడుకలకు రావాల్సిందిగా కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను మండల కేంద్రానికి చెందిన ముస్లీంలు శుక్రవారం ఆహ్వానించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేను కలిసి సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త, ఎంపీటీసీ గోపాల్, మజీద్ కమిటీ అధ్యక్షుడు రవూఫ్, ఉపాధ్యక్షులు జావీద్, నాయకులు లాయక్‌అలీ, జహంగీర్ అలీ, అర్షాద్, ఖలీద్, ఆమేర్, మోహిన్, ఇద్రీస్ తదితరులు ఉన్నారు.

‘పట్నం’లో ఈదురుగాలులు, వర్షం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రాత్రి ఏడు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కొద్దిసేపు కురిసింది. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనాలు వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే వర్షానికి రోడ్లపైప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

నూతన ఆవిష్కరణలు చేపట్టండి

ఆర్ అండ్ డీ డైరెక్టర్ చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోభానగర్‌లో గల సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం హ్యాకతాన్–2023 కార్యక్రమంలో బాగంగా నూతన ఆవిష్కరణల పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నేటి సమాజానికి కొత్త ఆవిష్కరణలు ఎంతో అవసరమని అందుకు యువత కృషిచేయాలన్నారు. ఈ పోటీలో వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి బహుమతి సీఎంఆర్ కళాశాల విద్యార్థులు దక్కించుకోగా, రెండవ బహుమతిని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డా.ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపాల్స్ శేఖర్‌బాబు, డా.సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్స్ క్రిష్ణమోహన్‌రావు, డా.భాగ్యరాజ్, కన్వీనర్ ప్రొ.క్రిష్ణయ్య, హెచ్ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటివెలుగు

తుర్కయంజాల్: కంటి వెలుగును కేంద్రాల సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య అన్నారు. శుక్రవారం తుర్కయంజాల్‌లోని 12వ వార్డులో కౌన్సిలర్ పుల్లగుర్రం కీర్తన విజయానంద రెడ్డితో కలిసి ఆయన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. మాజీ సర్పంచ్ చెవుల దశరథ, పార్టీ వార్డు అధ్యక్షులు కొంతం యాదిరెడ్డి, కొల్లూరి నిరంజన్ రెడ్డి, నాయకులు ఆర్ల కృష్ణ, బొడ్డు శ్రీను, మేతరి శంకర్, బరిమెల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రేపు బసవేశ్వర జయంతి

ఇబ్రహీంపట్నం: మహాత్మ బసవేశ్వర జయంతి ఉత్సవాలకు తరలిరావాలని వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి శివకుమార్ పిలుపునిచ్చారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని శ్రీభవాని నాగలింగేశ్వరస్వామి ఆలయంలో సమావేశాన్ని నిర్వహించి బసవేశ్వర జయంతి ఉత్సవాలపై చర్చించారు. ఆదివారం బసవేశ్వరుని జయంతిని పురస్కరించుకొని ఉదయం 9 గంటలకు ఇబ్రహీంపట్నంలో బైక్ ర్యాలీని నిర్వహించాలని, స్థానిక చెరువు కట్ట వద్ద ఉన్న బసవేశ్వరుని విగ్రహానికి పూజలు, కొంగరలోని కలెక్టరేట్ వద్ద జయంతి వేడుకల్లో పాల్గొనాలన్నారు. అనంతరం స్థానిక నాగలింగేశ్వర స్వామి ఆలయంలో బసవేశ్వరుని చిత్రపటాన్ని పెట్టి ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, వీరశైవులందరూ తప్పక హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం జిల్లా అధ్యక్షులు పట్నం శెట్టి విశ్వనాథ్, కార్యదర్శి ఆనందప్ప, కుమార్, అశోక్, విజయప్ప, సిద్ధప్ప, మధు, గిరిధర్, యాదప్ప, నాగేశ్ పాల్గొన్నారు.

రూ.14.12 లక్షలు పలికిన తైబజార్

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని తైబజార్ వేలంను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం ముగ్గురు పోటీపడగా తొర్రూర్‌కు చెందిన వంగేటి రాధిక రూ.14 లక్షల 12వేలకు దక్కించుకున్నారు. ఇందులో 25 శాతం డబ్బులు వెంటనే చెల్లించగా, 50 శాతం 4 నెలల్లో, మిగతా 25 శాతం ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి చెల్లించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ సత్యనారాయణ, ఇన్‌చార్జి మేనేజర్ బాలరాజు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్‌కు చెందిన మద్దూని ప్రభాకర్ ప్రమాదవశాత్తు జారిపడటంతో బలమైన గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు, శుక్రవారం స్థానిక సర్పంచ్ కాడమోని శ్రీశైలం ఆస్పత్రికి వెళ్లి ప్రభాకర్ ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్, చంద్రమౌలి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని స్వేరో సర్కిల్‌లోని విద్యార్థులకు శుక్రవారం సర్పంచ్ లలితా జ్యోతయ్య పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, నోట్ బుక్కులు, పెన్సిళ్లు అందజేశారు. ఈనెల 23న విద్యార్థులకు గురుకుల ఎంట్రెన్స్ పరీక్షలు జరుగనున్నాయి. విద్యార్థుల సౌకర్యార్థం వీటిని పంపిణీ చేసినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో స్వేరో సర్కిల్ నిర్వాహకులు సురేష్, ఈశ్వర్, జంగయ్య, వెంకటయ్య, శ్రీశైలం, మహేష్, తదితరులు పాల్గొన్నారు.